

28వ ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న నర్సాపురంలోని అల్లూరి సత్యనారాయణరాజు కల్చరల్ అసోసియేషన్ హాలులో ఏడో నూలి సాయి అభయ్ స్మారక ఆలిండియా ఓపెన్ చెస్ క్రీడాపోటీలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు మంగళవారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయని, విజేతలకు రూ.64 వేల విలువైన ప్రోత్సాహక నగదు బహుమతితోపాటు జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు, నగదు బహుమతులు 'అభయ్ ఛారిటబుల్ ట్రస్ట్' కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీలకు దేశవ్యాప్తంగా రికార్డుస్థాయిలో 500 మందికిపైగా అగ్రశ్రేణి క్రీడాకారులతోపాటు ఫిడే (ప్రపంచ చదరంగం సమాఖ్య) టైటిల్ క్రీడాకారులు కూడా పాల్గొననున్నారని పేర్కొన్నారు.

ఏ గ్రామం.. ఎవరికి..?



ఎన్నికల పందేల్లో వింత పోకడలు

గ్రామాలవారీ అభ్యర్థికి వచ్చే ఓట్లు, మెజార్టీపై పందేలు

కుటుంబాలవారీగా లెక్కలు వేస్తూ బెట్టింగులు

ప్రతి నియోజకవర్గంలోనూ దాదాపు 70 వరకూ గ్రామాలు

గ్రామాల్లో తారాస్థాయికి పందేల జోరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల పందేలు వికృత రూపం దాల్చాయి. ప్రస్తుతం సాగుతున్న పందేల తీరు చూసి అంతా విస్తుపోతున్నారు. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపోటములపై బెట్టింగులు సాగడం సాధారణంగా జరుగుతోంది. అయితే ఈసారి బెట్టింగుల విష సంస్కృతి కొత్త పుంతలు తొక్కుతోంది. అభ్యర్థి గెలుపోటములపై జరిగే పందేలు కాకుండా గ్రామాలవారీగా వచ్చే ఓట్లపైనే పందేల జోరు పెద్దఎత్తున సాగుతోంది. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈసారి ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు సాగాయి. ప్రతి నియోజకవర్గంలోనూ ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో బెట్టింగ్‌రాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ప్రతి మండలంలోనూ సరాసరిన 15 నుంచి 20 గ్రామాల వరకూ ఉన్నాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉంటే దాదాపు 70 వరకూ గ్రామాలు ఉన్న పరిస్థితి ఉంది. వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులకు ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ పార్టీ అభ్యర్థికి ఆ గ్రామంలో మెజార్టీ వస్తుంది అనే అంశాలపై పందేల జోరు సాగుతోంది. గ్రామాల్లో ఏ కుటుంబం ఏ పార్టీకి ఓటు వేసి ఉంటుందనే అంచనాలు వేస్తూ ఈ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. అభ్యర్థి గెలుపోటములపై జరిగే పందేల కంటే గ్రామాలవారీగా జరిగే బెట్టింగులు ఊహించని రీతిలో సాగుతున్నాయి. ఈ గ్రామంలో వైసిపికి రూ.వెయ్యి మెజార్టీ వస్తుందని ఒకరు పందెం కాస్తే.. అంత రాదని మరొకరు పందెం వేస్తున్నారు. ఫలానా గ్రామంలో టిడిపి కూటమి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని ఒకరు, కాదు వైసిపి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని మరొకరు పందేలు కాస్తున్నారు. ఇవీ కోసు (ఒకటికి, రెండు) పందేల తరహాలో సాగుతున్నాయి. గ్రామాలవారీగా ఓట్లపై సాగుతున్న పందేల వైపు సామాన్య ప్రజానీకం ఆకర్షితులవుతున్నారు. ఈ పందేలు తక్కువగా రూ.పది వేల నుంచి రూ.పది లక్షలు వరకూ సాగుతున్నట్లు చెబుతున్నారు. మధ్యవర్తులను పెట్టుకుని ఈ పందేలు పడుతున్నారు. గ్రామాలవారీగా ఓట్లు లెక్కల ప్రాతిపదికన అభ్యర్థి గెలుపు, మెజార్టీపై పందేలు వేస్తున్నారు. ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. మధ్యలో 20 రోజులకుపైగా వ్యవధి ఉండటంతో ఎన్నికల పందేలు రోజురోకంగా వికృతరూపం దాల్చుతున్నాయి. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ గ్రామాలవారీ పందేలు సాగుతున్నాయి. జిల్లాలో ఉత్కంఠ రేపుతున్న ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో ఈ పందేల జోరు మరింత ఎక్కువగా కన్పిస్తోంది. సామాన్యులు సైతం నలుగురు, ఐదుగురు కలిసి రూ.40 నుంచి రూ.50 వేలు జమ చేసి పందేలకు దిగుతున్నారు. దీంతో ఇంట్లో కుటుంబసభ్యులు గగ్గోలు పెడుతున్న పరిస్థితి ఏర్పడింది. జూన్‌లో స్కూళ్లు తెరుస్తారు. పిల్లలకు స్కూల్ ఫీజులు, యూనిఫారం, పుస్తకాలు వంటి అనేక ఖర్చులు ఉంటాయి. ఖరీఫ్ సీజన్ సైతం ప్రారంభమవుతోంది. సార్వా సాగుకు పెట్టుబడులకు సొమ్ము అవసరం. ఈ తరుణంలో అప్పు చేసి మరీ ఎన్నికల పందేల్లోకి దిగడం కుటుంబ సభ్యులను తీవ్రంగా వేధిస్తోంది. కొంతమంది రెచ్చగొట్టి మరీ పందేలకు ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

గెలిచిన అభ్యర్థులు కక్ష సాధించే ప్రమాదం

గ్రామాలవారీగా పందేలు వేస్తున్న తీరుపై ఆయా గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక గ్రామంలో వైసిపికి ఎక్కువ ఓట్లు వస్తే అక్కడ కూటమి అభ్యర్థి గెలిస్తే ఆ గ్రామంపై కక్ష తీర్చుకునే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. అదేవిధంగా మరో గ్రామంలో కూటమి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చి వైసిపి అభ్యర్థి గెలిచినా అదే పరిస్థితి రానుందని చెబుతున్నారు. గతంలోలా గ్రామాలవారీగా ఓట్లు లెక్కలు వేసేసప్పటికీ కౌంటింగ్ తర్వాత అంతా మరిచిపోయేవారు. ఇప్పుడు పందేలు సైతం గ్రామాలవారీగా జరుగుతుండటంతో కక్షలు పెరిగే ప్రమాదం ఉందని అంతా అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఏ కుటుంబం ఏ పార్టీకి ఓటు వేసిందనే అంచనాలు సైతం భవిష్యత్తులో ఇబ్బందులు తెచ్చే ప్రమాదం కన్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బెట్టింగ్‌లు జరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందనే చర్చ నడుస్తోంది

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆసుపత్రులకు చెల్లించాల్సిన రూ.వందల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేకుండా చూడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. ఆదివారం మెంటేవారితోటలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జెఎన్.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో పలుచోట్ల ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ పరిస్థితి అద్దం పడుతోందన్నారు. అత్యవసర వైద్య సేవలు అందాల్సిన రోగులకు ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం బకాయిలు చెల్లించి వైద్య సేవలు అందేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. అనిశ్చితంగా జబ్బులు, వైద్య ఖర్చులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి ప్రజలు పెద్దసంఖ్యలో గుండె, కేన్సర్, లివర్, కిడ్నీ, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని పశ్చిమగోదావరి కాలుష్యం, రోగాల జోన్‌గా మారిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని అరికట్టి పరిశుభ్రమైన తాగునీరు అందించి రోగాల బారి నుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. తేమ శాతం పేరుతో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలు అరికట్టి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కౌలు కోతలు అరికట్టాలని దళితులు, క్రిస్టియన్ శ్మశాన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని, వేతనం పెంచాలని కోరారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణాలివ్వాలని కోరారు. ఈ సమస్యలపై జిల్లాలో ఆందోళనలు నిర్వహిస్తామని బలరాం ప్రకటించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోరు పెద్దిరాజు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐఐటిల్లో ప్రవేశానికిగాను దేశవ్యాప్తంగా నిర్వహించే జెఇఇ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఈ కేంద్రంలో ఉదయం, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 250 మందికిగాను 249 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.



హడావుడిగా పట్టుబడి పడుతున్న రైతులు

ఆక్సిజన్ అందక..

ఆక్వా అతలాకుతలం..!

తేలిపోతున్న చేపలు - సుమారు రూ.100 కోట్లకుపైగా నష్టం

ప్రజాశక్తి - కాళ్ల

తుఫాన్, ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆక్సిజన్ అందక ఆక్వా రంగం అతలాకుతలమవుతోంది. చాలా చెరువుల్లో చేపలు తేలిపోతున్నాయి. టన్నులకొద్దీ చేపలు తేలిపోవడంతో రైతుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది.

జిల్లాలో ఆకివీడు, కాళ్ల, ఉండి, గణపవరం, మొగల్తూరు, నరసాపురం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. చేపలు చనిపోతుంటే అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రొయ్యలు, చేపల సాగు చేపట్టారు. ఏటా జిల్లా నుంచి 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.14 వేల కోట్లకుపైగా ఆదాయం లభిస్తోంది. తుఫాను కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని రెండు రోజులు చల్లని వాతావరణం, ఆపై ఉక్కబోత కారణంగా చెరువుల్లో ఆక్సిజన్ అందక చేపలు తేలిపోతున్నాయి. మత్స్య సంపదను రక్షించుకోవడానికి రైతులు అదనపు పెట్టుబడులు పెడుతున్నా స్వల్ప ఆక్సిజన్ సమస్యతో చేపలు చనిపోతుండటంతో కొంతమంది రైతులు హడావుడిగా చేపలు పట్టుబడి చేస్తున్నారు. ఆకివీడు, కాళ్ల, ఉండి, గణపవరం, మొగల్తూరు, నరసాపురం తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఈ సమస్య నెలకొంది. రెండు రోజుల్లో సుమారు రూ.100 కోట్లకుపైగా నష్టపోయినట్లు అంచనా. వేలాది రూపాయలు వెచ్చించి చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. మందులు చల్లుతున్నారు. అయినా చేపలు తేలిపోతుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు చేపలు కొంటున్నారని రైతులు వాపోతున్నారు.

ఆక్సిజన్‌తోనే అసలు సమస్య

చేపల చెరువుల్లో ఆక్సిజన్ ఒక్కసారిగా తగ్గిపోవడం, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌తో చేపలు తేలిపోతున్నాయి. చేపలకు ఆక్సిజన్ అందడం లేదు. చెరువుల్లో సుమారు 5, 6 అడుగుల నీరు ఉండాలి. ఎకరాకు 5 వేల నుంచి 10 వేల వరకూ చేపలను వేసిన చెరువులకు నీరు తక్కువ వల్ల ఆక్సిజన్ సమస్య తలెత్తిందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల చేపల చెరువుల నీటిలో ఉప్పు శాతం పెరిగింది. శీలావతి, కట్ల మోసు చేపలకు ఆక్సిజన్ ఎక్కువ అవసరం. కాలువ నీరు వచ్చేంత వరకు ఆక్సిజన్ సమస్య ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

చేపలు గట్లపైనే వదిలేస్తున్నారు

కొన్ని ప్రాంతాల్లో ఉక్కబోత వల్ల చెరువుల్లో చేపలు తేలిపోవడంతో వాటిని గట్లపైనే వదిలేసిన పరిస్థితి ఉంది. కొంతమంది రైతులు ముందస్తు పట్టుబడులతో అయినకాడికి అమ్మేస్తున్నారు. చేపలు చనిపోకుండా వివిధ మందులు వాడినా ఫలితం దక్కడం లేదు. దొడ్డనపూడి, ప్రాతాళ్లమెరక, జువ్వలపాలెం, కాళ్లకూరు తదితర గ్రామాల్లో చేపల చెరువుల రైతులు చెరువుల్లో ఉన్న చేపలను దక్కించుకునేందుకు పట్టుబడులు పడుతున్నారు.



తీరని నష్టం

అడ్డాల నాగరాజు, ఆక్వా రైతు, కాళ్లకూరు

శనివారం రాత్రి చేపలకు ఆక్సిజన్ సమస్యతో 50 ఎకరాల చెరువుల్లో చేపలు తేలిపోయాయి. చెరువు గట్టు వరకు వచ్చిన చేపలను పట్టుకున్నాం. ఐదు టన్నుల చేపలను అయినకాడికి విక్రయించుకోవాల్సి వచ్చింది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. రైతు కోలుకోలేని పరిస్థితి ఉంది. నష్టపోయిన ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రజాశక్తి - ఆకివీడు

వాతావరణంలో పెనుమార్పులతో గత రెండు రోజుల్లో చేపల చెరువుల్లో డిఒ (ఆక్సిజన్‌లో హెచ్చుతగ్గులు) ఒక్కసారిగా పడిపోయింది. దీనికితోడు ఆదివారం ఎండ తీవ్రత అనూహ్యంగా పెరిగింది. ఇక చెప్పేదేముంది చావు బతుకుల మధ్య ఉన్న చేపలు సైతం ఒకసారి తేలిపోయాయి. శని, ఆదివారాల్లో తిరగబడ్డ చేపలను వెంటనే ఏరించి రైతు మార్కెట్‌కు తరలించాడు. రొయ్య పరిస్థితీ అంతే. దీంతో ఆదివారం స్థానిక చేపల మార్కెట్ కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో చేపల లోడింగ్ వాహనాలు వచ్చాయి. చెరువుల్లో పట్టుబడి పట్టిన చేప అప్పటికప్పుడు ఐస్‌లో వేసి ఎగుమతి చేసే పరిస్థితి ఉంటుంది. అయితే ఇప్పుడు రైతులు తెచ్చిన చేప కనీసం 12 గంటల నుండి 24 గంటలు క్రితమే చెరువులో తిరగబడిపోయిన పరిస్థితి. దీంతో ఇది ఎగుమతికి పనికి రాదు. దీంతో రైతులు ఎంతొచ్చినా చాలు అంటూ స్థానిక మార్కెట్‌కు చేపలను తరలించడంతో నిన్నటి వరకూ రూ.150 నుంచి రూ.300 వరకూ పలికిన ధర రూ.20 నుంచి రూ.50 వరకే పరిమితమైంది. ఒక దశలో చేపలు అమ్ముడుకాక గాల్లో విసిరేశారు. గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా చేపను పెంచిన రైతులు పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని లబోదిబోమంటున్నారు.

కిలో చేప @ 20

తేలిపోయిన చేప, రొయ్య

కిటకిటలాడిన మార్కెట్



నాలుగు రెట్లు ఎక్కువ చేపలొచ్చాయి

అల్లాడి అంజిబాబు, చేపలవ్యాపారి, ఆకివీడు

ప్రతిరోజూ ఈ మార్కెట్‌లో 10 టన్నులకుపైగా చేపల ఎగుమతులు, అమ్మకాలు సాగుతుంటాయి. అయితే ఈ రోజు అనూహ్యంగా రోజుకన్నా నాలుగు రెట్లు చేపలు మార్కెట్‌కు వచ్చి పడ్డాయి. దీంతో కిలో రూ.20కే చేపలు అమ్మేస్తున్నాం.



ఆకివీడు మార్కెట్‌లోకి వెల్లువలా వచ్చిన చేపలు

ఆరు నెలల కష్టం నాశనమైంది

ఆర్.కృష్ణ, చేపల రైతు, ఎన్‌టిఆర్ జిల్లా

ఆరు నెలల కష్టం మొత్తం నాశనమైంది. మళ్లీ అప్పు చేసి సాగు చేయాల్సిందే. కిలో రూ.250 పలుకుతుందని ఆశించిన చేప రూ.40కే అమ్మాల్సి వచ్చింది. ఇంత దారుణం ఎప్పుడూ లేదు.

స్లూయిస్ తలుపులను ఆధునికీకరించండి

కౌలురైతుల సంఘం నేతల డిమాండ్



స్లూయిస్‌ను పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

కాకరపర్రు నుండి యలమంచిలి మండలం వడ్డిలంక వరకు ఉన్న నక్కల డ్రెయిన్‌పై వడ్డిలంక వద్ద ఏర్పాటు చేసిన స్లూయిస్ తలుపులను తక్షణం ఆధునికీకరించాలని, అక్కడున్న లిఫ్ట్ ఇరిగేషన్ ఇంజిన్లు ద్వారా వరద ముంపు సమయంలో స్లూయిస్ అవతల వైపునకు ముంపునీరు తోడేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు ఆదివారం ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతాగోపాలన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో కాకరపర్రు నుండి వడ్డిలంక వరకు ఉన్న నక్కల కాలువను ఆనుకుని పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల పరిధిలో 15 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో వరి, ఆక్వా ఇతర పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రతి సార్వా పంటకు వరద ముంపు సమయంలో వడ్డిలంక స్లూయిస్ వద్ద గోదావరి వరద పోటు ఎగువస్థాయిలో రోజులు తరబడి ఉండటంతో స్లూయిస్ వద్ద ముంపునీరు బయటకు లాగే పరిస్థితి ఉండటం లేదన్నారు. దీనికి తోడు అధికారులు లాకుల తలుపుల నిర్వహణ పట్టించుకోకపోవడంతో గోదావరి పోటు గ్రామాల వైపునకు పొడవడం, అటు ఎగువ గ్రామాల నుంచి ముంపునీరు రావడంతో నక్కల కాలువను ఆనుకుని ఉన్న వడ్డిలంక, కాంబొట్లపాలెం, గుంపర్రు, వద్దిపర్రు, గుమ్ములూరు, ఆచంట వేమవరం, మినిమించిలిపాడు తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు మునకకు గురై తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వడ్డిలంక స్లూయిస్ తలుపులు ఆధునికీకరించాలని, స్లూయిస్ వద్ద కోట్లాది రూపాయలతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల ద్వారా వరద సమయంలో అవతలి వైపుకి ముంపునీరు తోడేలా చర్యలు తీసుకునేందుకు తక్షణం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి ప్రసాద్, రైతులు శీలబోయిన సత్యనారాయణ, జడ్డు బద్రినారాయణ, పల్లె జార్జిబాబు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపులో 200 మందికి చికిత్స



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు బగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో బిపి, షుగరు, ఫిట్సు, పెరాలసిస్ ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ క్యాంప్‌కి పరిసర ప్రాంతాల రోగులు సుమారు 200 మంది ఉపయోగించుకున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. ఈ క్యాంప్‌లో 3 నెలలకు సరిపడా మందులను కేవలం రూ.300లకే అందజేశామన్నారు. క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకు నిర్వహించే ఈ క్యాంప్‌ని అందరూ వినియోగించుకోవాలన్నారు. వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు ఈ క్యాంప్‌కి వచ్చి రోగులకు సేవలందించిన డాక్టర్లకు పుష్పగుచ్ఛములిచ్చి అభినందించారు. ఈ క్యాంప్‌కు ప్రముఖ న్యూరాలజీ డాక్టర్ గోపాళం శివన్నారయణ, జనరల్ ఎమ్‌డీ జి.పద్మ, సందీప్‌వర్మ పి.సత్యనారాయణరాజు, మానవతా, సేవాదృక్పథంతో ఆహ్వానించగానే ఈ క్యాంప్‌లో పాల్గొని తమ వంతుగా సేవలందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 28న మంగళవారం మెంటేవారితోట సుందరయ్య భవనంలో జరిగే ఉచిత చిన్నపిల్లల గుండె మెడికల్ క్యాంప్‌ను వినియోగించుకోవాల్సిందిగా ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు అంతా సహకరించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎంతో కీలకం, ఓట్ల లెక్కింపుకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు అన్ని విధాలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం కోరారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 4న జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు సెంటర్ల నందు ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకే మొదలవుతుందన్నారు. మొదట పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, అనంతరం ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఇవిఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపుకు 10 టేబుళ్లు ఏర్పాటుకు తొలుత అనుమతి పొందగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధికంగా పోలైనందున మరో ఐదు టేబుల్స్ ఏర్పాటుకు ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి పొందడం జరిగిందన్నారు. మొత్తం 15 టేబుల్స్‌ను పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు వినియోగించడం జరుగుతుందన్నారు. 15 టేబుల్స్‌కు సంబంధించి అదనంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఏర్పాటు కూడా ఇసిఐ నుంచి అనుమతి పొందడం జరిగిందన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా అసెంబ్లీ కౌంటింగ్ హాల్స్ నందు అనుమతి పొందిన నాలుగు టేబుల్స్‌లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న తర్వాత వాస్తవ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సంపూర్ణంగా అర్థం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ రెండు కవర్లు ఉంటాయని, బయటి కవర్ను ఫారం 13-సి అంటారని దానిని తెరిచిన తర్వాత రెండు డాక్యుమెంట్లు ఉంటాయని అందులో ఒకటి డిక్లరేషన్ 13-ఎ అంటారని, ఇంకొకటి 13-బి కవరులో నిజమైన పోస్టల్ బ్యాలెట్ ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి గతంలో ఉన్న ఉత్తర్వులను అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు కొంత వెసులుబాటు కల్పిస్తూ సవరణలతో మే 25న మరియొక ఉత్తర్వులను ఎన్నికల కమిషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి డిక్లరేషన్ 13-ఎ లో ఓటర్ తప్పనిసరిగా సంతకం చేసి ఉండాలన్నారు. ఫామ్-13ఎలో ఓటర్ సంతకం లేనివాటిని, ఆర్ఒ సంతకం, బ్యాలెట్ సీరియల్ నెంబర్‌లేని వాటిని తిరస్కరించడం జరుగుతుందన్నారు. ఆర్ఒ సంతకం ఉన్న పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందన్నారు. ఆర్ఒ సీల్ లేకున్నా తిరస్కరించవద్దన్నారు. ఫామ్-13ఎపై ఆర్ఒ సంతకంతో పాటు అన్ని వివరాలు ఉండాలన్నారు. ఆర్ఒ సంతకం సహ బ్యాలెట్‌ను ధృవీకరించే రిజిస్టర్, కౌంటర్ ఫైల్స్‌తో సరిపోల్చుకోవాలని సూచించారు. అంతేకాకుండా గెజిటెడ్ అధికారి ధృవీకరించి సంతకం చేసి స్టాంపు వేయడం గాని లేదా హోదా గాని రాసి ఉండాలన్నారు. అలా ఉంటేనే అది చెల్లుబాటు అవుతుందన్నారు. ఏవైనా ఓట్లు చెల్లుబాటు కాకపోతే 13-సి కవర్లో ఉంచి తిరస్కరిస్తూ వేరుగా పెట్టెలో ఉంచడం జరుగుతుందన్నారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుందన్నారు. ఒక్కో టేబుల్‌కు 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అలాగే పార్లమెంటు రిటర్నింగ్ అధికారి వద్దనే సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్(ఇటిపిబిఎస్)లను కూడా లెక్కించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ఒక టేబుల్‌ను ఏర్పాటు చేస్తామని, ఆ టేబుల్ వద్ద కూడా పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపారు.

మహిళా కళాశాలకు సైన్స్ పరికరాలు అందజేత



పాఠశాలకు బహూకరించిన పరికరాలు

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు జిల్లా ప్రజా పరిషత్ మహిళా జూనియర్ కళాశాలకు సైన్స్ ల్యాబ్ నిమిత్తం సుమారు రూ.మూడు లక్షల విలువైన ల్యాబ్ సామాగ్రిని ఆదివారం దాతలు పాఠశాలలో అందజేశారు. రాయకుదురు గ్రామానికి చెందిన నార్కెడుమిల్లి పద్మావతి దేవి జ్ఞాపకార్థం భర్త నార్కెడుమిల్లి జై.రామారావు కుటుంబ సభ్యులు పాఠశాలకు బహుకరించడం జరిగింది. పాఠశాల పూర్వ విద్యార్థిగా తమ వంతు సహాయ సహకారాలను పాఠశాలకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని దాతలు పేర్కొన్నారు. సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన దాతలను గ్రామస్తులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గెడ్డం భారతి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గుబ్బల సత్యనారాయణ, దాతలు నార్కెడుమిల్లి జయ రామారావు, నార్కెడుమిల్లి నాగ వెంకట పెరుమాళ్ల గుప్తా, నార్కెడుమిల్లి సుబ్బారావు గుప్తా, నార్కెడుమిల్లి సుబ్బయ్య గుప్తా పాల్గొన్నారు.

చెరువులో కనువిందుగా తామర పూలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కంసాల బేతపూడి గ్రామంలో మంచినీటి చెరువు తామర పుష్పాలతో నిండి పోయింది. ఉదయం సమయంలో తామర పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గం గుండా వెళ్లే వారు ఆగి మరి అక్కడ ఫోటోలు దిగి వెళ్తున్నారు. పక్కతి ప్రేమికులను ఆకట్టుకునే లాగా ఈ చెరువు ఉంది. కొన్ని ఏళ్ల క్రితం వీటి ఆకులు మటన్, చికెన్ వ్యాపారులు కోసుకుని వెళ్లి మాంసం అమ్మేటప్పుడు పొట్లాలు కట్టేందుకు ఉపయోగించేవారు. ఇప్పుడు పాలిథిన్ కవర్‌లో మాంసం అమ్మడంతో ఈ ఆకుల వినియోగం తగ్గింది.




ఆకట్టుకుంటున్న తామరపూలు..

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి



సందడి చేస్తున్న పర్యాటకులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులతో ఆదివారం కలకల్లాడింది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. వాళ్లు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు బీచ్‌కు వచ్చి సేద తీరారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం..

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పాలకొల్లు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక రోటరీ భవనంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఉల్లంపర్తి మాంటిసోరి స్కూల్ అధినేత మద్దాల వాసు, కార్యదర్శిగా విజయ ల్యాబ్స్ అధినేత కొమ్ముల మురళి, కోశాధికారిగా ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఉంటుంది. మానవత మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న మానవతా సేవా కార్యక్రమాల్లో పాలకొల్లు శాఖను మరింత ఉన్నత స్థితికి తీసుకురావాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వచ్చేనెల 23వ తేదీన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల రామారావు, సహాయ కార్యదర్శి గోపి, సభ్యులు బొక్కా గంగాధర్, చిలుకూరి భీమన్న పాల్గొన్నారు.


ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారిస్తున్న అధికారి

ట్రాక్టర్‌ను అడ్డుకున్న ఆర్‌టిఎ అధికారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పోలమూరు గ్రామంలో తగిన అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను తణుకు ఆర్‌టిఎ సంజయ్ కుమార్ అడ్డుకున్నారు. గడచిన నాలుగు రోజులుగా గ్రామం నుంచి సాగుతున్న మట్టి అక్రమ రవాణా గురించి అందిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తాను క్షేత్ర పరిశీలనకు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్ నెం.ఎపి 37-ఎల్ఎస్ 2175, నెం. ఎపి 37-బిఎఫ్ 3020ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అపరాధ రుసుముగా రూ.20 వేలు చలానా విధించినట్టు ఆయన తెలిపారు.


దంచికొడుతున్న ఎండ..

రోహిణి కార్తె ప్రభావంతో ఎండ తీవ్రం

ప్రజాశక్తి - పాలకొల్లు

గత 4 రోజులుగా వాతావరణం రూపాంతరం చెందుతోంది. ఆదివారం వాయుగుండం తుఫాన్‌గా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే పాలకొల్లులో రోహిణి కార్తె ప్రభావం తొలి రోజు శనివారం లేకపోయినా ఆదివారం ఎండ మండింది. ఎండకు తోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆకాశంలో ఎటువంటి మేఘావృతం కాకపోవడంతో ఎండ మెండుగా కాసింది. దీంతో ప్రజలు శెలవు దినమైనా ఇంటికే పరిమితం అయ్యారు.

నేరాలు - ఘోరాలు

ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులు

ప్రజాశక్తి - తణుకు

ఏడేళ్ల బాలికపై ఒక వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన తణుకు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎన్‌టిఆర్ పార్కు సమీపంలో నివాసం ఉంటున్న చదలవాడ తిమోతి తన ఇంటి సమీపంలో ఉంటున్న ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత బాలిక విషయాన్ని ఇంట్లో చెప్పడంతో తిమోతిని స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో బాధంపూడి నుంచి తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తుతెలియని సుమారు 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ప్రమాదవ శాత్తు మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడు పసుపు రంగు ఆఫ్ హాండ్స్ బనియన్, డార్క్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతదేహమును తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన యెడల 9490617090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని రైల్వే ఎస్ఐ జి.శ్రీహరి బాబు తెలిపారు.

కత్తితో దాడి : పలువురికి గాయాలు

ప్రజాశక్తి - నరసాపురం

కొబ్బరి బొండాలు చెక్కే కత్తితో యువకలపై దాడి చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్‌బి చర్ల పంచాయతీ బైనపాలెంలో రోడ్డు మీద బైక్‌పై వెళ్తున్న కంచర్ల మణికంఠ, అదే గ్రామానికి చెందిన ఉల్లంపర్తి కళ్యాణ్‌కి వివాదం నెలకొంది. దీంతో మణికంఠ సోదరుడు యుగంధర్ వివాదం ఆపడానికి మధ్యలో వెళ్తే కళ్యాణ్ కొబ్బరి బొండాలు చెక్కే కత్తితో యుగంధర్ తలపై నరికాడు. మణికంఠ, తండ్రి రామకృష్ణ కూడా గాయపడ్డాడు. దీంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై మొగల్తూరు ఎస్ఐ కె.వెంకటరమణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.


చికిత్స పొందుతున్న యుగంధర్

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు సంసిద్ధ్ సొంతం

చైర్మన్ వాసా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసాపురం



సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు సంసిద్ధ్ పాఠశాలల సొంతం అని, సిబిఎస్ఇ ఫలితాల్లో సంసిద్ధ్ పాఠశాలలు సంచలనం సృష్టించాయని సంసిద్ధ్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, జమ్మూ, హర్యానా మొత్తం 17 స్కూళ్లలో 14 వేల మంది విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, అనంతపురం, వినుకొండ, నరసరావుపేట, చిత్తూరు, వేంపల్లి కర్ణాటకలో బెంగళూరు, కనకపూర్, తమిళనాడులో వెల్లూరు, మధురై, రాశిపురం, జమ్మూ, హర్యానాలో తమ స్కూల్స్ ఉన్నాయన్నారు. నరసాపురం బ్రాంచిలో ప్రిన్సిపల్‌గా మెట్ల సురేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం 8:45 ప్రార్థనతో ప్రారంభం అవుతుందని, ఉదయం 9 గంటల నుంచి నాలుగు గంటల వరకు స్కూలు నడుస్తుందన్నారు. నర్సరీ, కిండర్ గార్డెన్ వారికి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ప్లస్ టు వరకు క్లాసులు జరుగుతాయన్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఐఐటి, నీట్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 11, 12వ తరగతులకు జెఇఇ మెయిన్స్, నీట్ కోచింగ్ ఇవ్వబడుతుందన్నారు. ఎసి హాస్టల్ సదుపాయం కలదన్నారు. నరసాపురం బ్రాంచ్‌లో 600 మందికిపైగా విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నారన్నారని తెలిపారు. 2020లో నరసాపురంలో తమ బ్రాంచ్ ప్రా రంభించామన్నారు. ప్రారంభం నుంచి ప్రతి ఏడాది సిబిఎస్ఇ ఫలితాల్లో సంచలనం సృష్టిస్తున్నామన్నారు. పశ్చి మగోదావరి జిల్లానే కాకుండా తూర్పుగోదావరి జిల్లా నుంచి సైతం విద్యార్థులు తమ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నారని, వారికి అనుగుణంగా శివారు ప్రాంతాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. తమ స్కూల్‌లో చదివే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని, చదువుతో పాటుగా కరాటే, డాన్స్, కూచిపూడి, క్రీడలు, సంగీతం, బ్యాట్మెంటన్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, స్కేటింగ్, డ్రాయింగ్‌లపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ స్కూళ్లలో పూర్తిస్థాయి సిబ్బందితో ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. ఈ ఏడాది నుంచి ఎసి క్లాస్‌రూమ్స్ ప్రారంభిస్తున్నామన్నారు. ఆరో తరగతి నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేపిస్తామన్నారు. పిల్లల్లో భయాన్ని పోగొట్టేందుకు స్టేజిపై మాట్లాడేలా ప్రతి ఏడాది మూడుసార్లు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఏడాదికి ఒకసారి స్కూళ్లలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ప్రాంగణమంతా సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటుందన్నారు. బాయ్స్, లేడీస్‌కు వేరుగా



హాస్టల్ సదుపాయం ఉందన్నారు.

2023-24 సిబిఎస్ఇ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. 10-12 తరగతులు కలిపి మొత్తం 53 మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్లో పాసైయారన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌ల్లో, ఎసి గదులలో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తమ సిబ్బంది పిహెచ్‌డి చేసిన అధ్యాపకులు ఉన్నారన్నారు. సిబిఎస్ఇ సిలబస్‌లో మార్పులు, కాంపిటెన్సీ ప్రశ్నలకనుగుణంగా ముందస్తు ప్రణాళిక రచించి తమ పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఆధ్యాపకులు కృషి చేశారన్నారు. ఏడాదికి రెండుసార్లు తమ స్కూల్‌ల్లో డెంటిస్ట్, యూరాలజిస్ట్ స్పెషలిస్టులచే విద్యార్థులకు వైద్య పరీక్షలు ఏర్పాటు చేస్తున్నామని, పిల్లలకు చదువుతోపాటు పండుగల గొప్పతనం తెలిసేలా ప్రతి పండుగను జరుపుతామన్నారు. 11 ఎకరాల ప్రాంగణంలో, 3.5 ఎకరాల క్రీడా ప్రాంగణంలో తమ సంసిద్ధ్ నరసాపురం బ్రాంచ్ నడుపుతున్నామని తెలిపారు. డైరెక్టర్ వాసా నాగ మాధవి, సిఇఒ ఇందుసానో, ప్రిన్సిపల్ మెట్ల సురేష్ సారథ్యంలో సంసిద్ధ్ సంచలనం సృష్టిస్తుందన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, మరిన్ని వివరాలకు 94934 76767, 94910 4321కి సంప్రదించగలరని వాసా శ్రీనివాస్ తెలిపారు.


డైరెక్టర్ వాసా నాగ మాధవి

పోటీ ప్రపంచానికి దీటుగా విద్యాబోధన

హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రవికుమార్


స్కూల్ ప్రాంగణం..

ప్రజాశక్తి - ఆచంట

పోటీ ప్రపంచానికి దీటుగా విద్యాబోధన అందించి, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లక్ష్యమని ఆ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యను అందించే సంస్థ అన్నారు. నర్సరీ నుంచి పదవ తరగతి వరకూ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రప్రథంగా గుర్తింపు పొందిన హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఇదే అన్నారు. తమ సంస్థలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. ఉన్నత ప్రమాణాల సాధనకు కృషి చేస్తున్న మా హైస్కూల్‌లో పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. అందరి ఆదరాభిమానాలతో స్కూలుకు కొత్త హంగులు సమకూర్చుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2023-2024 విద్యా సంవత్సరమునకు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో కుడిపూడి జాహ్నవి, కుంపట్ల జయశ్రీ, కాంౖదేకుల ఫణీంద్ర, ఎం.ధరణి విద్యార్థులు నాలుగు సీట్లు సాధించిన ఘనత హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌దే అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విధానం వల్ల ఇంటివద్ద విద్యార్థులకు ట్యూషన్లు అవసరం ఉండదన్నారు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తున్న సంస్థ హోలీ ఏంజెల్స్ అని వివరించారు. అనుభవజ్యులైన ఉపాధ్యాయులతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు మండలంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 59 మంది విద్యార్థుల్లో 58 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలోను, మరొక విద్యార్థి ద్వితీయ స్థానంలోనూ 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్యాసంస్థ హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అన్నారు. వీరిలో బి.పల్లవి 588, జె.మున్ని రూప 569, కె.రాకేష్ 568, బి.భాను తేజ 563 అత్యధిక మార్కులతో మండలంలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులు సాధించిన విద్యాసంస్థ అన్నారు. విద్యార్థులు చదివే పరమాధిగా కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరిస్తూ సాధారణ విద్యార్థి సైతం అలోవకగా అసాధారణ ఫలితాలను సాధించేటట్లు అవసరమయ్యే విద్య విధానాలను రూపొందించి, ఆచరణ సాధ్యం చేసిన ఘనత హోలీ ఏంజెల్స్‌కే సొంతమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన తమ విద్యాసంస్థలు నర్సరీ నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని రవికుమార్ తెలిపారు.


కరస్పాండెంట్

ప్రత్యేకతలు..

- విద్యార్థులకు ఐఐటి, జెఇఇ, నవోదయ ప్రత్యేక శిక్షణ
- పిల్లలకు అబాకస్ నందు ప్రత్యేక శిక్షణ
- విద్యార్థులకు కరాటే, యోగాలో శిక్షణ
- ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, ఇండోర్ గేమ్స్, క్రీడలు
- కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం
- విద్యార్థులకు బస్సు, వ్యాను సౌకర్యం

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పెంటపాడు

పెంటపాడు శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11:30 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి మహమ్మద్ జుల్ఫికర్ తెలిపారు. పిల్లలు తమ వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకునేలా చేసి, పిల్లల్లో చదివే జిజ్ఞాస పెంపొందించడం, పాఠశాల వయస్సు పిల్లలకు గ్రంథాలయాన్ని సందర్శించడం అనేది వారి రోజువారి దిన చర్యల్లో భాగంగా అలవాటు చేయడం అన్నారు. మరీ ముఖ్యంగా సెల్ ఫోన్ నుంచి దూరం చేయడం, భౌతిక ఆట-పాటలకు చేరువ చేయడం అనే ఉన్నత లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేసవి శిక్షణా తరగతులలో వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం, నైపుణ్యాలు నేర్పించడంతో పాటు కంప్యూటర్ తరగతులు, సరదా కబుర్లు, స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, క్యారమ్స్, జనరల్ నాలెడ్జ్ తరగతులు వంటి ఎన్నో ఆహ్లాదకరమైన అంశాలు ఉంటున్నాయన్నారు. పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జుల్ఫిఖర్ తెలిపారు.



ఎస్ఆర్‌హెచ్ అని చెక్కిన అభిమాని

పెన్సిల్‌పై ఎస్ఆర్‌హెచ్ ఆర్ట్

ప్రజాశక్తి - నరసాపురం

చెన్నైలో జరుగుతున్న ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్‌లో కెకెఆర్, ఎస్ఆర్‌హెచ్ తలబడుతుంది. ఈ మ్యాచ్‌లో తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌కు చెందిన సన్‌రైజర్స్ గెలవాలని కోరుకుంటూ నరసాపురం పట్టణంకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ కొప్పినీడి విజయ్ పెన్సిల్ ముక్కుపై ఇంగ్లీషులో ఎస్ఆర్‌హెచ్ అని చెక్కి అభిమానాన్ని చాటుకున్నారు. విజయ్ వృత్తిరీత్యా మండలంలోని లిఖితపూడి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తూ తన ప్రతిభను కనబరిచాడు.

బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో కిటకిట

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ప్రణాళికాబద్ధమైన బోధనతోనే నూరు శాతం ఉత్తీర్ణత

ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - కాళ్ల



పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా బోధించారని ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలవడం గర్వంగా ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులను వారి సామర్థ్యాన్ని బట్టి గ్రేడులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగుపరిచామన్నారు. కాళ్ల మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మాలవానితిప్ప హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉప్పుటేరు తీర ప్రాంతంలో మారుమూల గ్రామమైన మాలవానితిప్పలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు సమిష్టి కృషితో హైస్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పాఠశాల సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కార్పొరేట్‌కు దీటైన బోధనతో రేపటి భవితకు భరోసా కల్పించే విధంగా హైస్కూల్‌లో బోధిస్తున్నామన్నారు. ఈ పాఠశాలకు రెండు కిలోమీటర్ల నుంచి ఐదు కిలోమీటర్ల వరకు దూర ప్రాంతాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు వచ్చి విద్యనభ్యసిస్తున్నారన్నారు. మనో వికాసానికి ఎంతో దోహదపడుతుందనే సద్భావంతో గ్రామంలోని కొంతమంది దాతల సహకారంతో అర ఎకరం స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి సమకూర్చమన్నారు. పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వర్చ్యువల్ క్లాస్ రూమ్(విసిఆర్), రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్లాస్ రూమ్(డిసిఆర్)లు ఏర్పాటు చేశామన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులతో పాఠశాల క్రీడా ప్రాంగణానికి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ నిర్మాణంలో దాతలు 20 శాతం నిధుల భాగస్వామ్యాన్ని అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు పాఠశాల నుంచి కొల్లాటి శాలిని అందుకోవడం జరిగిందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదులు నిర్మాణం నిమిత్తం కోటి రూపాయల నిధులతో నాలుగు తరగతి గదులు నిర్మించామన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం క్రమంగా పెరుగుతుందన్నారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషి, గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ చిలువూరి రాణి నిరంతర మార్గదర్శకత్వంలో గత విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో 93 శాతం ఉత్తీర్ణతతో మాలవానితిప్ప హైస్కూల్ ప్రథమ స్థానం సాధించడం జరిగిందన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాళ్ల మండలంలో మాలవానితిప్ప హైస్కూల్‌లో 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 30 మంది పాసై నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కొల్లాటి షాలిని 544 మార్కులు సాధించి స్కూల్ ప్రథమ స్థానం నిలవడం గర్వంగా ఉందని తెలిపారు.


మాలవానితిప్ప హైస్కూల్ భవనం


కొల్లాటి షాలిని

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపునకు కృషి

ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ


పాఠశాల ప్రాంగణం..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ పాఠశాల 1952లో ఏర్పాటు చేయబడిన నాటి నుంచి నేటి వరకూ ఎందరో విద్యార్థులు విద్యాభ్యాసం చేసిన పాఠశాల ఇది. ఈ పాఠశాలలో విద్యతో పాటు అనేక నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ పాఠశాల ప్రత్యేకత అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు. ఈ పాఠశాల నుంచి ఎందరో నాయకులు వివిధ హోదాల్లో ప్రజలకు సేవను అందించడం విశేషం. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు, దేశవిదేశాల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ పాఠశాల గొప్పతనం. గత సంవత్సరంలో ఈ పాఠశాల విద్యార్థులు ఇటు విద్యా రంగంలో, నైపుణ్యాలలోనూ మంచి స్థానాలను సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యలు పెంపొందించడానికి విశాలమైన ఆటస్థలం ఆనాటి దాతల సహకారంతో ఈ పట్టణ నడిబొడ్డున కలిగి ఉండటం ఈ పాఠశాల ప్రత్యేకత. దేశ రక్షణకు మేము సైతం సిద్ధమంటూ మాతృభూమికి సేవ చేయుటకు అంకిత భావంతో శిక్షణ పొందటానికి ఎన్‌సిసి విభాగం ఈ పాఠశాలలో ఉండటం మరొక ప్రత్యేకత. 1952లో బోర్డు స్కూల్‌గా ఏర్పాటు చేయబడిన ఈ పాఠశాల 1966కి హై స్కూల్‌గా మార్చబడి, జిల్లా పరిషత్ విభాగంలో జిల్లాలోని పెద్ద హైస్కూల్స్‌లో ఒకటిగా ఉంది. రాష్ట్రస్థాయిలోనూ, జాతీయస్థాయిలోనూ ఈ పాఠశాల విద్యార్థులు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడినట్లు తెలిపారు. 1968లో ఎన్‌సిసి స్థాపించబడిన నాటి నుంచి ఈ విభాగం ద్వారా సుమారు 26 మంది ఇండియన్ ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్స్‌లలో దేశానికి సేవలందించడానికి ఎంపిక కాబడడం ఈ పాఠశాల గొప్పతనం. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణతలో గణనీయమైన ప్రగతిని సాధించటం ఓ ఘన విజయం. పదవ తరగతి ఫలితాల్లో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఏలూరి కీర్తి 575 మార్కులతో నియోజకవర్గంలో తృతీయ స్థానాన్ని అందుకుంది. ఈ పాఠశాల నుంచి 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 13 మంది ఉన్నారు. ఈ పాఠశాల విద్యార్థి ఎమ్ఎస్‌వి.కుమార్ రాష్ట్ర స్థాయిలో 69వ ర్యాంకుతో నాగార్జునసాగర్ ఎపి ఆర్‌జెసి కళాశాలలో ఇంటర్మీడియట్ సీటును ఓపెన్ కాంపిటీషన్‌లో సాధించటం ఈ పాఠశాల బోధనకు అద్దం పడుతుందన్నారు. అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అమలయ్యే ఈ పాఠశాల ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పిఎం శ్రీ పాఠశాల జాబితాలో చేరడం ఒక విశేషం. ఈ పాఠశాల విద్యార్థులకు పట్టణంలోని ప్రముఖుల ద్వారా ఎన్నో రకాల ఉపకార వేతనాలను అందించే దాతలు ఉండటం కూడా ఒక ప్రత్యేకతగా చెప్పాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు.


హెచ్ఎం


పాఠశాలలో ఎన్‌సిసి శిక్షణ..

'రానున్నది టిడిపి ప్రభుత్వమే'

మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది టిడిపి ప్రభుత్వమేనని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాలలో ఇటీవల శస్త్ర చికిత్సలు చేయించుకున్న పలువురుని ఆయన పరామర్శించారు. శేరెపాలెం మాజీ సర్పంచి మామిడిశెట్టి రాజ్యలక్ష్మి భర్త హోంగార్డ్ ఏడుకొండలు ఇటీవల షుగర్ వ్యాధి ప్రభావంతో తన కాలు కోల్పోవడంతో ఆయన పరామర్శించారు. అనంతరం ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడారు. ఏడుకొండలు హోంగార్డు ఉద్యోగాన్ని పునరుద్ధరించాలని కోరారు. దీనిపై ఎస్‌పి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అదే గ్రామానికి చెందిన దుసనపూడి నరసింహారావు గుండెకి శస్త్ర చికిత్స, కొత్తపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి రామకృష్ణ కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వారిని, కుటుంబ సభ్యులను సుబ్బారాయుడు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అధిక మెజార్టీతో టిడిపి, జనసేన కూటమి విజయం సాధిస్తుందని తెలిపారు. ఆయన వెంట మహిళా బత్తుల రాంబాబు, దూసనపూడి కోటి, సత్యనారాయణ, గురాజు శ్రీను ఉన్నారు.


పరామర్శిస్తున్న సుబ్బారాయుడు